RNI NO:APTEL /2023/90201

POST REGD NO :NSV/15/2026-28

రాజధాని

తెలుగు దినపత్రిక

వాయిస్

web : www.rajadhanivoice.in

rajadhanivoicedaily@gmail.com

విలేఖరులు కావలెను

రాజధాని వాయిస్ తెలుగు దినపత్రికలో కోనసాగుటకు

గుంటూరు,పల్నాడు,జిల్లాలలో స్టాఫర్లు

నియోజకవర్గాలకు ఇంచార్జులు మరియు

మండలాల వారిగా విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించగలరు.

9030343195

అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును

సంపుటి : 02 | సంచిక : 355 | 15 ఆదివారం నవంబర్ 2026 | ఎడిటర్ : పాగళ్ల పూర్ణచంద్రరావు | పేజీలు : 4 | వెల : రూ.1/-

ఎన్సీపీ వర్గాల విలీనం లేనట్లే సుప్రియా సూలే



ఎన్సీపీ రెండు వర్గాలు తిరిగి ఏకం కానున్నాయని రాజకీయ వర్గాల్లో మళ్లీ చర్చ మొదలైన నేపథ్యంలో.. ఎన్సీపీ (ఎస్పీ) ఎంపీ సుప్రియా సూలే కీలక వ్యాఖ్యలు చేశారు. తన సోదరుడు అజిత్ పవార్ మరణంతోనే తమ విలీన చర్చలకు తెరపడిందన్నారు. ఆ తర్వాత అటువైపు నుంచి ఎటువంటి సమాచారం అందలేదని స్పష్టం చేశారు. భాజపా నేతృత్వంలోని ఎన్డీయేలో ఎన్సీపీ (ఎస్పీ) చేరుతుందనే ఊహాగానాలను కూడా ఆమె ఖండించారు."అజిత్ పవార్ జీవించి ఉన్నప్పుడు రెండు వర్గాల విలీనంపై చర్చలు జరిగాయి. ఒక తేదీని కూడా ఖరారు చేశారు. కానీ, ఆయన మృతి చెందిన రోజే.. ఈ అంశం పూర్తిగా ముగిసిపోయింది. ఆయన మరణం తర్వాత ఈ అంశంపై మా పార్టీ ఎటువంటి ప్రకటన చేయలేదు. అజిత్ పవార్ వర్గం నుంచి కూడా దీనికి సంబంధించి నాకు ఒక్క ఫోన్ కాల్, మెసేజ్, లెటర్ కూడా రాలేదు. ఎవరూ నన్ను సంప్రదించలేదు" అని అన్నారు. విలీనంపై అజిత్ పవార్ కుటుంబ సభ్యులతో చర్చలు జరిపే అవకాశం ఉందా? అనే ప్రశ్నకు బదులిస్తూ.. వ్యక్తిగత బంధుత్వాలను రాజకీయాలతో కలపకూడదని పేర్కొన్నారు.

పంచాయతీ ఎన్నికలను తేలిగ్గా తీసుకోవద్దు..

కూటమి బలపరిచిన అభ్యర్థులే గెలవాలి: సీఎం చంద్రబాబు

పరిషత్ మరియు మున్సిపల్ ఎన్నికల్లో కూటమి ప్రభంజనం

గ్రామాల్లోనూ ప్రభంజనం కొనసాగాలన్న టీడీపీ అధినేత

రాబోయే 30 ఏళ్లకు ఉపయోగపడేలా

నాయకత్వ నిర్మాణం చేపడదామని సంకల్పం

ఎట్టి పరిస్థితుల్లో గొడవలకు పోవద్దన్న ముఖ్యమంత్రి

గతం కంటే కూటమికి 25 శాతం ఓటు బ్యాంకు పెరిగిందని వెల్లడి



అమరావతి, రాజధానికి వాయిస్ : ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల జరిగిన మున్సిపల్, పరిషత్ ఎన్నికల్లో ప్రజలు కూటమి ప్రభుత్వానికి చారిత్రక విజయాన్ని అందించారని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. పార్టీ ముఖ్యనేతలతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 94 మున్సిపాలిటీల్లో, 3,235 వార్డుల్లో ఎన్డీఏ అభ్యర్థులు ఘన విజయం సాధించారని తెలిపారు. అలాగే 575 జడ్పీటీసీ స్థానాలు, 7,500 కంటే ఎక్కువ ఎంపీటీసీ స్థానాల్లో కూటమి నిలబెట్టిన అభ్యర్థులు జయకేతనం ఎగురవేశారని వివరించారు. ఈవీఎంలు అయినా, బ్యాలెట్ పేపర్లు అయినా, చివరకు పోస్టల్ బ్యాలెట్లలోనైనా ప్రజలు కూటమికే సంపూర్ణ మద్దతు పలికారన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల వల్లే గతంతో పోలిస్తే కూటమికి ఓటు బ్యాంకు ఏకంగా 25 శాతం పెరిగిందని చంద్రబాబు తెలిపారు. ఉద్యోగులంతా ప్రభుత్వ విధానాలకు మద్దతుగా నిలిచారని, వైసీపీ తప్పుడు ప్రచారాలను ప్రజలు ఏమాత్రం నమ్మలేదని పేర్కొన్నారు. సుమారు 7 జిల్లాల్లో కూటమి క్లీన్ స్వీప్ చేసిందని, ముఖ్యంగా అనకాపల్లి, మార్కాపురం జిల్లాల ప్రజలు 100 శాతం స్ట్రైక్ రేట్ ఇచ్చారని గుర్తుచేశారు. పోలవరం ఎడమ కాల్వ ద్వారా అనకాపల్లికి నీటిని అందించడం, మార్కాపురం కొత్త జిల్లా ఏర్పాటు, వెలిగొండ ప్రాజెక్ట్ ఫేజ్-1 ఫలాలు ఈ ఫలితాల్లో స్పష్టంగా ప్రతిబింబించాయని విశ్లేషించారు.రాబోయే రోజుల్లో జరగనున్న మరో 23 పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కూటమి అభ్యర్థులు తిరుగులేని ▸▸2

అయ్యో పాపం అనే రోజులు పోయాయి.. చుక్కలు చూపిస్తాం: బొత్స సత్యనారాయణ



విజయనగరం, రాజధానికి వాయిస్ : విజయనగరం జిల్లాలో నిర్వహించిన వైసీపీ సమావేశంలో మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ కీలక వ్యాఖ్యలు చేశారు. రాబోయే రోజుల్లో కక్షపూరిత రాజకీయాలు చేసే వారికి తగిన రీతిలో సమాధానం చెబుతామని, చుక్కలు చూపిస్తామని గట్టిగా హెచ్చరించారు. గతంలో మాదిరిగా రాజకీయ ప్రత్యర్థులపై అనవసర సానుభూతి చూపిస్తూ 'అయ్యో పాపం' అని వదిలేసే పరిస్థితులు ఇకపై ఉండబోవని బొత్స సత్యనారాయణ స్పష్టం చేశారు. రాష్ట్రంలో వేగంగా మారుతున్న రాజకీయ పరిణామాలను గమనిస్తుంటే, వైసీపీ నాయకులు, కార్యకర్తలు తమ ఆలోచనా విధానాన్ని (మైండ్ సెట్) మార్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఏర్పడుతోందని ఆయన అభిప్రాయపడ్డారు. అందరినీ సమానంగా చూసే రాజకీయాలు ప్రస్తుత వాతావరణంలో ఇకపై పని చేయవేమోనని ఆయన వ్యాఖ్యానించారు.రాష్ట్ర రాజకీయాల్లో ఎదురవుతున్న ప్రస్తుత పరిస్థితులు, పార్టీ వర్గాలు అనుసరించాల్సిన వైఖరిపై తన మనసులోని అభిప్రాయాలను ఇప్పటికే పార్టీ అధినేత జగన్ దృష్టికి తీసుకెళ్లినట్లు బొత్స వెల్లడించారు. కక్షసాధింపు చర్యలను ఇకపై ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.

అమరావతి మెగా రైల్వేస్టేషన్ రూట్ ఖరారు..

గంటకు 160 కి.మీ వేగంతో వెళ్లేలా ట్రాక్!

ఎర్రుపాలెం నుంచి నంబూరు వరకు 58.1 కిలోమీటర్ల మేర కొత్త రైల్వే లైన్

గంటకు 160 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించేలా ఆధునిక ట్రాక్ నిర్మాణం

కృష్ణా నదిపై 4.5 కిలోమీటర్ల మేర భారీ ఐకానిక్ వంతెన

తాడికొండ సమీపంలో అమరావతి ప్రధాన రైల్వే స్టేషన్

కొప్పరవూరు వద్ద 230 ఎకరాల్లో భారీ రైల్వే టెర్మినల్



నామినేషన్ల వేళ దాడి ముప్పు ఉంటే అభ్యర్థులకు ఎస్కార్ట్ ఇస్తాం: ఏపీ ఎన్నికల సంఘం

తిరుపతి కలెక్టరేట్‌లో 12 జిల్లాల పోలీసు ఉన్నతాధికారులతో ఎస్ఈసీ పునేఠా సమీక్ష

గ్రామ పంచాయతీలు, పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల భద్రతపై ప్రధాన చర్చ

ఇటీవల పల్నాడు, రాయలసీమల్లో జరిగిన ఘర్షణల నేపథ్యంలో ముందస్తు చర్యలు



తిరుపతి, రాజధానికి వాయిస్ : ఆంధ్రప్రదేశ్‌లో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికలు, పెండింగ్‌లో ఉన్న పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) అనిల్‌చంద్ర పునేఠా ఈరోజు ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. తిరుపతి కలెక్టరేట్‌లో జరిగిన ఈ సమావేశానికి, సమస్యాత్మకంగా గుర్తించిన 12 జిల్లాలకు చెందిన ఐజీలు, డీఐజీలు, ఎస్పీలు హాజరయ్యారు. ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణ, నామినేషన్ల ప్రక్రియ, పోలింగ్ సజావుగా సాగేందుకు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై పోలీసు అధికారులతో ▸▸2

శ్రీకాళహస్తి ఆలయంలో స్పై కెమెరా కళ్లజోడు కలకలం..

భక్తుడిని అదుపులోకి తీసుకున్న ఎస్పీఎఫ్

రహస్య కెమెరా ఉన్న కళ్లజోడుతో ఆలయంలోకి ప్రవేశించిన పూజె వ్యక్తి

కెమెరా కళ్లజోడు ధరించిన భక్తుడిని గుర్తించిన అర్చకులు

గర్భాలయ దృశ్యాలు చిత్రీకరించారా అనే కోణంలో అధికారుల విచారణ

సినీ పరిశ్రమకు గిరిబాబు సేవలు చిరస్మరణీయం.. ప్రముఖుల సంతాపం



కోస్తాంధ్రకు తుపాను హెచ్చరిక.. 18 నుంచి భారీ వర్షాలు!

బంగాళాఖాతంలో క్రమంగా బలపడుతోన్న అల్పపీడనం

నవంబర్ 16 సాయంత్రానికి తుపానుగా మారే అవకాశం

కోస్తాంధ్ర, ఒడిశాలలో 18, 19 తేదీల్లో భారీ వర్షాల సూచన

సముద్రంలోకి వెళ్లవద్దని మత్స్యకారులకు హెచ్చరిక

నవంబర్ 15 నాటికి తీరానికి తిరిగి రావాలని అధికారుల సూచన



అమరావతి, రాజధానికి వాయిస్ : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం మరింత బలపడుతూ కోస్తాంధ్ర, ఒడిశా తీరాల వైపు కదులుతోంది. ఇది రానున్న 48 గంటల్లో తుపానుగా మారే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. దీని ప్రభావంతో నవంబర్ 18, 19 తేదీల్లో కోస్తాంధ్ర, ఒడిశా తీర ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. ఈ నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది.ఆగ్నేయ బంగాళాఖాతం లో, అండమాన్ సముద్రానికి ఆనుకుని ఏర్పడిన ఉపరితల ఆవర్తనం కారణంగా ఈ అల్పపీడనం కేంద్రీకృతమైంది. ఇది వాయవ్య దిశగా ప్రయాణిస్తూ నవంబర్ 15వ తేదీ ఉదయానికి వాయుగుండంగా, ఆ తర్వాత మరింత తీవ్రమై నవంబర్ 16 సాయంత్రం నాటికి మధ్య బంగాళాఖాతంలో తుపానుగా రూపాంతరం చెందుతుందని ఐఎండీ అధికారులు ▸▸2

చంద్రబాబు మరో క్రెడిట్ చోరీ.. వైఎస్ జగన్ ధ్వజం

తాడేపల్లి, రాజధానికి వాయిస్ : చంద్రబాబు మరోసారి క్రెడిట్ చోరీకి పాల్పడటంపై వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఏఈఐ ర్యాంకింగ్స్‌ను చంద్రబాబు తన ఘనతగా చెప్పుకోవటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను వైఎస్ జగన్ ఆధారాలతో పాటు ట్వీట్ చేశారు.

ఏఈఐ (AEI) ర్యాంకింగ్స్‌లో ఏపీకి మూడో స్థానం రావటం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ఘనతేనని వైఎస్ జగన్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. కానీ, దీన్ని కూడా తన ఖాతాలో వేసుకునేందుకు చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని ఆయన మండిపడ్డారు. మరోసారి చంద్రబాబు క్రెడిట్ చోరీకి పాల్పడుతున్నారని విమర్శించారు.

మీ ప్రయత్నం సిగ్గుచేటు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సాధించిన ఘనతలను తన ఖాతాలో వేసుకునే ప్రయత్నం చేయటం సిగ్గుచేటని వైఎస్ జగన్ ధ్వజమెత్తారు. "2021--24 ▸▸2



రాష్ట్ర స్థాయి టైక్వాండోలో సముద్రికి కాంస్య పతకం

- 45 కేజీల విభాగంలో ప్రతిభ చాటిన క్రీడాకారిణి
- నిమ్మాడలో అభినందించిన మంత్రి అచ్చెన్నాయుడు
- కోచ్ నర్సిపురం శేఖర్‌కు ప్రశంసలు టెక్కలి
- క్రీడాకారులకు ఇప్పటివరకు ఆరు పతకాలు



నిమ్మాడ, రాజధానికి వాయిస్ : రాష్ట్ర స్థాయి అండర్-19 బాలబాలికల టైక్వాండో పోటీల్లో టెక్కలి ఎన్టీఆర్ క్రీడా వికాస కేంద్రానికి చెందిన క్రీడాకారిణి సింహాద్రి సముద్రి కాంస్య పతకం సాధించింది. పిఠాపురంలో ఈ నెల 10, 11 తేదీల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో బాలికల 45 కేజీల విభాగంలో సముద్రి ప్రతిభ కనబరిచి పతకాన్ని సొంతం చేసుకుంది. ఈ విజయంపై రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నిమ్మాడలోని తన క్యాంపు కార్యాలయంలో సముద్రిని మంత్రి అచ్చెన్నాయుడు ప్రత్యేకంగా అభినందించారు. పోటీల్లో ఆమెకు శిక్షణ అందించిన కోచ్ నర్సిపురం శేఖర్‌ను కూడా కలిసి ప్రశంసించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకం సాధించి టెక్కలి ప్రాంతానికి గుర్తింపు తీసుకురావడం అభినందనీయమని పేర్కొన్నారు. క్రీడాకారిణి సాధించిన విజయాన్ని అభినందిస్తూ ఆమెకు ప్రోత్సాహం అందించారు.సముద్రి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని మంత్రి ఆకాంక్షించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో చూపిన ప్రతిభను కొనసాగిస్తూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని కోరుకున్నారు. క్రీడల్లో పట్టుదల, నిరంతర సాధనతో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని, యువ క్రీడాకారులు తమ ప్రతిభను మరింత మెరుగుపరుచుకోవాలని అభిలషించారు. ఈ ఏడాది స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో టెక్కలి ఎన్టీఆర్ క్రీడా వికాస కేంద్రం క్రీడాకారులు ఇప్పటివరకు మూడు స్వర్ణ, రెండు రజత, ఒక కాంస్య పతకం సాధించారు. మొత్తంగా ఆరు పతకాలతో క్రీడాకారులు తమ ప్రతిభను చాటుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ ప్రతిభావంతులైన క్రీడాకారులు ఉన్నారని ఈ విజయాలు నిరూపిస్తున్నాయి. వారికి సరైన శిక్షణ, ప్రోత్సాహం అందితే ఉన్నత స్థాయికి ఎదిగే అవకాశాలు ఉన్నాయని ఈ ఫలితాలు తెలియజేస్తున్నాయి. గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లోని ప్రతిభను గుర్తించి వారిని తీర్చిదిద్దేందుకు కోచ్‌లు చేస్తున్న కృషిని మంత్రి అచ్చెన్నాయుడు అభినందించారు. క్రీడాకారులకు శిక్షణ అందిస్తూ పోటీలకు సిద్ధం చేయడంలో కోచ్‌ల పాత్ర కీలకమని పేర్కొన్నారు. టెక్కలి ఎన్టీఆర్ క్రీడా వికాస కేంద్రం నుంచి మరింత మంది క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

సినీ పరిశ్రమకు గిరిబాబు సేవలు చిరస్మరణీయం.. ప్రముఖుల సంతాపం



ప్రముఖ తెలుగు సినీనటులు గిరిబాబు గారి మృతి పట్ల నా ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నాను. నటుడిగానే కాకుండా దర్శకుడిగా, నిర్మాతగా తన ప్రతిభను చాటుకున్నారు. ఆయన మరణం తెలుగు సినీ పరిశ్రమకు తీరనిలోటు. గిరిబాబు గారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను." – మంత్రి నారా లోకేశ్

తెలుగు చలనచిత్ర పరిశ్రమ దిగ్గజ నటులు గిరిబాబు గారు ఇకలేరనే వార్త కలచివేసింది. తెలుగు ప్రేక్షకుల మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ, కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను" – కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

నటుడు గిరిబాబు మృతిపట్ల సినీ, రాజకీయ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. "ప్రముఖ సీనియర్ నటుడు, దర్శక నిర్మాత గిరిబాబు కన్నుమూత విచారకరం. ప్రకాశం జిల్లాలో ఒక సామాన్య వ్యవసాయ కుటుంబంలో జన్మించిన గిరిబాబు ఐదు దశాబ్దాల పాటు 600లకు పైగా చిత్రాల్లో నటించి... విలన్‌గా, హాస్యనటుడిగా ఇంకా క్యారెక్టర్ ఆర్టిస్టుగా ప్రేక్షకులను మెప్పించారు. గిరిబాబు ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నాను. వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను" – ఏపీ సీఎం చంద్రబాబునాయుడు"గిరిబాబు గారు కన్నుమూశారని తెలిసి చింతిస్తున్నా. ప్రతినాయకుడిగా, కథానాయకుడిగా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా విభిన్నమైన పాత్రలు పోషించారు. చక్కటి హాస్యం కూడా పండించారు. నిర్మాతగా, దర్శకుడిగా విజయవంతమైన చిత్రాలు రూపొందించారు. గిరిబాబు రఘుబాబు గారికి, ఇతర కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను" –ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

"ప్రముఖ నటులు గిరిబాబు ఇకలేరనే వార్త నన్ను దిగ్భ్రాంతికి గురి చేసింది. విలక్షణమైన నటనతో, తనదైన ప్రత్యేక శైలితో ఎన్నో వైవిధ్యమైన చిత్రాల ద్వారా నటుడిగా, నిర్మాతగా, దర్శకునిగా తెలుగు చిత్ర పరిశ్రమకు గిరిబాబు అందించిన సేవలు చిరస్మరణీయం. ఆయన మరణం తెలుగు చిత్ర పరిశ్రమకు తీరని లోటు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ.. వారి కుటుంబ సభ్యులకు, అభిమానులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. – అగ్ర నటుడు చిరంజీవి

"సీనియర్ నటులు, దర్శక నిర్మాత గిరిబాబు మరణవార్త దిగ్భ్రాంతికి గురి చేసింది. నా కెరీర్ ప్రారంభంలోనే 'అన్నదమ్ముల అనుబంధం' సినిమాలో ఆయనతో కలిసి నటించాను. నాతో పాటు పలు చిత్రాల్లో ఆయన ప్రాధాన్యమున్న పాత్రలు పోషించారు. గిరిబాబు మంచి నటుడు మాత్రమే కాదు... మంచి వ్యక్తి కూడా. ఆయన లేని లోటు తీర్చలేనిది. వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నాను. గిరిబాబు తనయుడు రఘుబాబుకు, కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా" – అగ్ర నటుడు నందమూరి బాలకృష్ణ

పంచాయతీ ఎన్నికలను తేలిగ్గా తీసుకోవద్దు..

విజయం సాధించాలని నేతలకు దిశానిర్దేశం చేశారు. అదేవిధంగా గ్రామ పంచాయతీ ఎన్నికలను ఏమాత్రం తేలిగ్గా తీసుకోవద్దని హెచ్చరించారు. గ్రామాల్లో కూడా కూటమి బలపరిచే అభ్యర్థులే గెలవాలని, క్షేత్రస్థాయిలో ప్రజల ఆదరణ ఉన్న మంచి వ్యక్తులను, విద్యావంతులను, యువతను ప్రోత్సహించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో సరైన నాయకులను తీర్చిదిద్దుకోవడానికి ఈ ఎన్నికలు చక్కటి అవకాశమని, రాబోయే 30 ఏళ్లకు ఉపయోగపడేలా బలమైన నాయకత్వాన్ని నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు.కేంద్రం, రాష్ట్రం, మున్సిపాలిటీలు, జిల్లా పరిషత్‌లలో ఇప్పటికే ఎన్డీఏ అధికారంలో ఉందని, పంచాయతీల్లోనూ మన అభ్యర్థులు గెలిస్తే పాలన, అభివృద్ధి కార్యక్రమాలు మరింత వేగంగా, సజావుగా ముందుకు సాగుతాయని చంద్రబాబు పేర్కొన్నారు. ప్రజల మనోభావాలకు అనుగుణంగా పనిచేసినంత కాలం వారు మన వెంటే ఉంటారని స్పష్టం చేశారు. కొందరు కావాలనే హింసను నమ్ముకుంటారని, కానీ కూటమి పూర్తిగా ప్రజాస్వామ్యాన్ని మాత్రమే నమ్ముతుందని చెప్పారు. నాయకులెవరూ ఎట్టి పరిస్థితుల్లోనూ గొడవలకు పోవద్దని, చెడ్డ పేరు తెచ్చుకోవద్దని గట్టిగా హెచ్చరించారు. అధికారాన్ని కేవలం ప్రజలకు మంచి చేయడానికి, వారికి మరింత చేరువ కావడానికి మాత్రమే ఉపయోగించుకోవాలని సీఎం హితవు పలికారు. గెలిచిన ఎంపీటీసీలు, జడ్పీటీసీలు నిరంతరం ప్రజల్లో ఉంటూ పార్టీ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.

ఎన్నికలను వాయిదా వేయించేందుకు జగన్ కుట్రలు పన్నారు: ఎంపీ కలిశెట్టి



విజయనగరం, నవంబర్ 14 : వైసీపీ అధినేత జగన్‌పై విజయనగరం టీడీపీ ఎంపీ కలిశెట్టి అప్పల నాయుడు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో రౌడీ మూకలను ప్రోత్సహించి, అల్లర్లు సృష్టించడం ద్వారా ఎన్నికలను వాయిదా వేయించాలని జగన్ కుట్రలు పన్నారని ఆయన ఆరోపించారు. అమరావతిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.గత వైసీపీ ప్రభుత్వ హయాంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో పెద్ద ఎత్తున దౌర్జన్యాలు, అక్రమాలు జరిగాయని ఎంపీ కలిశెట్టి పేర్కొన్నారు. అయితే ప్రస్తుత ప్రభుత్వంలో ఎన్నికలు ఎంతో ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నాయని, దీనిని చూసి ప్రజలు హర్షిస్తున్నారని ఆయన చెప్పారు. ప్రజలు శాంతియుతంగా ఓటు హక్కు వినియోగించుకుంటుంటే, ఓర్వలేక ప్రత్యర్థి పార్టీ అలజడులు సృష్టించేందుకు ప్రయత్నిస్తోందని మండిపడ్డారు.జగన్ బెంగళూరు ప్యాలెస్‌లో కూర్చొని ఆంధ్రప్రదేశ్‌పై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఎంపీ ఆరోపించారు. తాడేపల్లి నివాసానికి జగన్ ఎప్పుడో ఒకసారి అతిథిలా వస్తూ, కేవలం ప్రెస్ మీట్లు పెట్టి ప్రజలను గందరగోళానికి గురిచేస్తున్నారని విమర్శించారు. వైసీపీ చేస్తున్న కుట్రలను రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని, భవిష్యత్ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఇదే సమావేశంలో, విశాఖపట్నంలో సీఐఐ పెట్టుబడుల సదస్సు విజయవంతం కావడంపై ఎంపీ హర్షం వ్యక్తం చేశారు.

చంద్రబాబు మరో క్రెడిట్ చోరీ.. వైఎస్ జగన్ ధ్వజం

మధ్యకాలంలో ఏపీ సామాజిక, ఆర్థిక అభివృద్ధిలో గణనీయమైన పురోగతి సాధించింది. ఓపీ జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీ, సెంటర్ ఫర్ న్యూ ఎకనామిక్ స్టడీస్ (CNES) సంయుక్తంగా రూపొందించిన యాక్సెస్ (ఇన్) ఈక్వాలిటీ ఇండెక్స్ (AEI) నివేదికలో ఏపీకి కీలక గుర్తింపు లభించింది. 2021లో ఏఈఐ సమగ్ర ర్యాంకింగ్స్‌లో పదో స్థానంలో ఉన్న ఏపీ.. 2024 నాటికి మూడో స్థానానికి చేరుకుంది.

ఈ పురోగతి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనిదే.

దేశంలోని అన్ని రాష్ట్రాల్లోనూ పదో స్థానం నుంచి మూడో స్థానానికి ఎదిగి అతిపెద్ద పురోగతి సాధించిన రాష్ట్రంగా ఏపీ నిలిచింది. 2021 ఏఈఐ నివేదికలో ఆరోగ్య సూచీలో ఏపీకి 8వ స్థానం లభించింది. 2024 నివేదికలో రాష్ట్రం రెండో స్థానానికి ఎగబాకింది. ఈ పురోగతి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సాధించినదే. 2021లో సామాజిక, ఆర్థిక భద్రతా సూచీలో ఏపీకి 11వ స్థానం. 2024 నాటికి **దేశంలోనే మొదటి స్థానానికి చేరుకుంది ఏపీ.**

సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యం ఇవ్వడం వల్లే ఈ ఘనత సాధ్యమైంది. పారదర్శకంగా సంక్షేమ పథకాల అమలు.. కష్టకాలంలోనూ ప్రజల కొనుగోలు శక్తికి భరోసా కల్పించాం. పరిశ్రమలు, తయారీ రంగాలకు ప్రోత్సాహం ఇచ్చాం. దక్షిణ భారతదేశంలోనే వేగవంతమైన వృద్ధి జరిగింది. ఉపాధి అవకాశాలు, సామాజిక భద్రత పెరగడానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ విధానాలే కారణం. 2021లో లీగల్ రికోర్స్ సూచీలో ఏపీకి 15వ స్థానం. 2024 నివేదికలో రెండో స్థానానికి చేరుకుంది రాష్ట్రం.అన్ని కీలక సామాజిక, మానవ అభివృద్ధి సూచీల్లోనూ ఏపీ గణనీయమైన పురోగతి సాధించింది. ఏపీ అభివృద్ధి కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన కృషిని చంద్రబాబు తన ఘనతగా ప్రచారం చేసుకుంటున్నారు. మా పాలనలో సాధించిన విజయాలను కప్పిపుచ్చి. రాష్ట్రం వెంటిలేటర్‌పై ఉందంటూ తప్పుడు ప్రచారం చేశారు. 2019--24 మధ్య సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యమివ్వడం వల్లే రాష్ట్రం సామాజిక, ఆర్థిక రంగాల్లో ముందడుగు వేసింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సాధించిన ఫలితాలకు ఏఈఐ నివేదికే నిదర్శనం" అని వైఎస్ జగన్ స్పష్టం చేశారు.

అమరావతి మెగా రైల్వేస్టేషన్ రూట్ ఖరారు..



అమరావతి,రాజధానికి వాయిస్ : ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి రైల్వే కనెక్టివిటీ కల్పించే ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులో కీలక ముందడుగు పడింది. అమరావతి మీదుగా వెళ్లే రైల్వే లైన్ రూట్, రాజధాని ప్రధాన రైల్వే స్టేషన్ ఏర్పాటు చేసే ప్రదేశం, భారీ టెర్మినల్ ప్రాంతాన్ని రైల్వే శాఖ దాదాపు ఖరారు చేసింది. గతంలో రూపొందించిన ప్రణాళికల్లో కొన్ని మార్పులు చేస్తూ తాజా రూపురేఖలను సిద్ధం చేశారు. రాజధాని ప్రాంతానికి పటిష్ఠమైన రోడ్డు, రైలు రవాణా వ్యవస్థను అనుసంధానించడమే లక్ష్యంగా ఈ ప్రాజెక్టును వేగవంతం చేస్తున్నారు.

58.1 కిలోమీటర్ల మార్గం.. గంటకు 160 కిలోమీటర్ల వేగం

ఎర్రుపాలెం (ఖమ్మం జిల్లా), నంబూరు (ఉమ్మడి గుంటూరు జిల్లా) మధ్య నిర్మించనున్న కొత్త రైల్వే కారిడార్ పొడవును గతంలో ప్రతిపాదించిన 56.53 కిలోమీటర్ల నుంచి 58.1 కిలోమీటర్లకు సవరించారు. ఈ మార్గంలో గరిష్ఠంగా గంటకు 160 కిలోమీటర్ల వేగంతో రైళ్లు రాకపోకలు సాగించే విధంగా అత్యంత ఆధునిక సాంకేతికతతో ట్రాక్‌ను నిర్మించనున్నారు. ఈ మార్గంలో కృష్ణా నదిపై సుమారు 4.5 కిలోమీటర్ల పొడవైన అద్భుతమైన ఐకానిక్ వంతెన ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. వీటితో పాటు మొత్తం 32 భారీ వంతెనలు, 92 చిన్న వంతెనలు, రాకపోకలకు ఎలాంటి అంతరాయం లేకుండా 12 రోడ్ ఓవర్ బ్రిడ్జిలు/అండర్ బ్రిడ్జిలు (ROB/RUB) నిర్మించేలా ప్రణాళిక రూపొందించారు.

తాడికొండ సమీపంలో ప్రధాన స్టేషన్.. కొప్పురావూరులో మెగా టెర్మినల్

రాజధాని కోర్ క్యాపిటల్ ఏరియాలో భాగంగా, తాడికొండకు సుమారు 5 కిలోమీటర్ల దూరంలో ప్రధాన అమరావతి రైల్వే స్టేషన్‌ను నిర్మించనున్నారు. దీనితో పాటు సుదూర ప్రాంతాల రైళ్ల నిర్వహణ కోసం కొప్పురావూరు వద్ద దాదాపు 230 ఎకరాల విస్తీర్ణంలో భారీ టెర్మినల్‌ను ప్రతిపాదించారు. 24 ఎల్‌హెచ్‌బీ (LHB) కోచ్‌లు కలిగిన భారీ రైళ్లను సులభంగా హ్యాండిల్ చేసేలా దీనిని తీర్చిదిద్దనున్నారు. ఈ టెర్మినల్‌లో 9 ప్రధాన ప్లాట్‌ఫామ్‌లు, 6 సైడ్ లైన్లు, రైళ్ల నిర్వహణకు అవసర మైన పిట్ లైన్లు, మరో 12 స్టేబ్లింగ్ లైన్లు ఏర్పాటు కానున్నాయి. ఈ మెయింటెనెన్స్ హబ్, టెర్మినల్ నిర్మాణం కోసం అవసరమైన భూమిని కేటాయించాలని రైల్వే శాఖ ఇప్పటికే ఏపీ సీఆర్‌డీఏ (AP CRDA) ను కోరింది.

మార్గంలో ఏర్పాటయ్యే స్టేషన్లు

ఈ కొత్త రైల్వే మార్గంలో మొత్తం తొమ్మిది స్టేషన్లు రానున్నాయి. పెద్దపురం, చెన్నారావుపాలెం, గొట్టుముక్కల, పరిటాల, కొత్తపల్లి, వడ్డమాను, అమరావతి, తాడికొండ, కొప్పురావూరు మీదుగా రైలు మార్గం సాగుతుంది. వీటిలో పెద్దపురం, పరిటాల, అమరావతి, కొప్పురావూరు స్టేషన్లను క్రాసింగ్ స్టేషన్లుగా అభివృద్ధి చేయనున్నారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఎర్రుపాలెం, నంబూరు స్టేషన్లను కీలక రైల్వే జంక్షన్లుగా మార్చనున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే అమరావతి నుంచి దేశంలోని అన్ని ప్రధాన నగరాలకు వేగవంతమైన, అత్యాధునిక రైల్వే రవాణా సదుపాయం లభించనుంది.

నామినేషన్ల వేళ దాడి ముప్పు ఉంటే అభ్యర్థులకు ఎస్కార్ట్ ఇస్తాం: ఏపీ ఎన్నికల సంఘం

ఆయన సమగ్రంగా చర్చించారు.సమీక్ష ముగిసిన అనంతరం పునేఠా మీడియాతో మాట్లాడుతూ కీలక వివరాలను వెల్లడించారు. గతంలో జరిగిన ఎన్నికల అనుభవాలను దృష్టిలో పెట్టుకుని భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. "ఇటీవల జరిగిన ఎన్నికల్లో పల్నాడు నుంచి రాయలసీమ వరకు కొన్ని గొడవలు జరిగాయి. సమస్యాత్మక 12 జిల్లాల ఎస్పీలతో ప్రత్యేకంగా మాట్లాడాం. పంచాయతీ ఎన్నికల సమయంలో మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించాం. నామినేషన్ల సమర్పణకు ఎవరైనా ప్రత్యేక ఎస్కార్ట్ కావాలంటే కల్పిస్తాం. దాడి ముప్పు ఉందని ఎస్పీకి చెబితే.. అభ్యర్థులకు ప్రత్యేక భద్రత కల్పిస్తారు" అని ఎస్ఈసీ అనిల్‌చంద్ర పునేఠా స్పష్టం చేశారు.గత ఎన్నికల్లో చోటుచేసుకున్న ఘర్షణలు పునరావృతం కాకుండా క్షేత్రస్థాయిలో కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని పోలీసు యంత్రాంగాన్ని ఎస్ఈసీ ఆదేశించారు. నామినేషన్ దాఖలు చేసే సమయంలో అభ్యర్థులకు ఎటువంటి ఆటంకాలు కలగకుండా చూడాలని, సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఉంచి ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు పూర్తయ్యేలా బాధ్యత తీసుకోవాలని స్పష్టం చేశారు.

శ్రీకాళహస్తి ఆలయంలో స్పై కెమెరా కళ్లజోడు కలకలం..



శ్రీకాళహస్తి, రాజధానికి వాయిస్ : ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీకాళహస్తి ఆలయంలో స్పై కెమెరా కళ్లజోడు కలకలం రేపింది. ఆలయ నిబంధనలను ఉల్లంఘించి కెమెరా అమర్చిన కళ్లద్దాలతో లోపలికి ప్రవేశించిన ఓ భక్తుడిని భద్రతా సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు.మహారాష్ట్రలోని పూణెకు చెందిన అంకేష్ అగర్వాల్ అనే భక్తుడు తన కుటుంబ సభ్యులతో కలిసి శ్రీకాళహస్తీశ్వర ఆలయ దర్శనానికి వచ్చారు. మొదట ఆయన ఆలయంలో రూ. 5,000 రుసుము చెల్లించి రాహు-కేతు నివారణ పూజ నిర్వహించారు. ఆ పూజ పూర్తయిన తర్వాత కుటుంబ సమేతంగా ప్రధాన ఆలయంలో స్వామి, అమ్మవార్ల దర్శనానికి వెళ్లారు. అమ్మవారి సన్నిధిలో దర్శనం చేసుకుంటుండగా, ఆయన కళ్లకు ఉన్న అద్దాలలో రహస్య కెమెరా (స్పై కెమెరా) అమర్చి ఉండటాన్ని అక్కడి అర్చకులు గుర్తించారు. విషయాన్ని గ్రహించిన అర్చకులు వెంటనే ఆలయ విధుల్లో ఉన్న స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్పీఎఫ్) సిబ్బందికి సమాచారం అందించారు. స్పందించిన భద్రతా సిబ్బంది సదరు భక్తుడిని అదుపులోకి తీసుకుని విచారణ ప్రారంభించారు.శ్రీకాళహస్తి ఆలయ ప్రాంగణంలోకి ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురావడం, ముఖ్యంగా గర్భాలయం పరిసరాల్లో ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ చేయటంపై కఠిన నిషేధం అమల్లో ఉంది. అలాంటిది తనిఖీలను దాటుకుని స్పై కెమెరా కళ్లజోడుతో ఆలయంలోకి ఎలా రాగలిగారనే దానిపై అధికారులు ఆరా తీస్తున్నారు. ఆలయ అంతరాలయంలోని సున్నితమైన దృశ్యాలను ఏమైనా రికార్డ్ చేశారా అనే కోణంలో పోలీసులు, ఎస్పీఎఫ్ సిబ్బంది దర్యాప్తు చేస్తున్నారు.

కోస్తాంధ్రకు తుపాను హెచ్చరిక.. 18 నుంచి భారీ వర్షాలు!

అంచనా వేస్తున్నారు. ఈ వ్యవస్థ కారణంగా అండమాన్ నికోబార్ దీవుల్లో నవంబర్ 16 వరకు భారీ వర్షాలు కొనసాగుతాయని తెలిపారు.

మత్స్యకారులకు తీవ్ర హెచ్చరికలు

తుపాను నేపథ్యంలో సముద్రం అల్లకల్లోలంగా ఉంటుందని, అలల ఉద్ధృతి తీవ్రంగా ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఇప్పటికే వేటకు వెళ్లిన మత్స్యకారులు నవంబర్ 15వ తేదీలోగా సురక్షితంగా తీరానికి తిరిగి రావాలని స్పష్టం చేసింది. అలాగే, మత్స్యకారులు తదుపరి ఆదేశాలు వచ్చేవరకు సముద్రంలోకి వెళ్లరాదని కఠిన హెచ్చరికలు జారీ చేసింది. ముఖ్యంగా నవంబర్ 17 వరకు అండమాన్ సముద్రంలోకి, నవంబర్ 15 నుంచి 18 వరకు ఆగ్నేయ బంగాళాఖాతంలోకి, నవంబర్ 16 నుంచి 19 వరకు మధ్య బంగాళాఖాతంలోకి వేటకు వెళ్లడం అత్యంత ప్రమాదకరమని అధికారులు సూచించా రు.ఇటీవలే 'అర్నాబ్', 'మురసు' తుపానులు ఆంధ్రప్రదేశ్, ఒడిశా సహా పలు రాష్ట్రాల్లో తీవ్ర నష్టాన్ని సృష్టించిన విషయం తెలిసిందే. ఈ అనుభవాల దృష్ట్యా తాజా హెచ్చరికలను తీవ్రంగా పరిగ ణించి, తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రభుత్వ సూచనలను పాటించాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

సర్పంచి పదవి @ రూ.29 లక్షలు



గార్లదిన్నె , రాజధానికి వాయిస్ : అనంతపురం జిల్లా గార్లదిన్నె మండల పరిధిలోని కొప్పలకొండ పంచాయతీ సర్పంచి పదవికి వేలం నిర్వహించారు. ఆదినారాయణ అనే వ్యక్తి రూ.29 లక్షలకు సర్పంచి పదవిని దక్కించుకున్నారు. ఆ గ్రామంలో నూతనంగా రామాలయ నిర్మాణం చేపడుతు న్నారు. నిధుల సేకరణలో భాగంగా సర్పంచి పదవికి వేలం పాట నిర్వహించాలని గ్రామస్థులంతా నిర్ణయించారు. గురువారం వేలం నిర్వహించగా.. తాజాగా ఈ విషయం వెలుగులోకి వచ్చింది.

నామినేషన్ల వేళ పటిష్ట పోలీసు బందోబస్తు

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు
150 మీటర్ల పరిధిలో ర్యాలీలు, గుంపులుగా చేరడంపై నిషేధం
సీసీ కెమెరాలు, డ్రోన్లతో నిరంతర నిఘా



గుంటూరు, రాజధానికి వాయిస్ : మున్సిపల్, గ్రామ పంచా యతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ నేపథ్యంలో ఎలాంటి అవాం ఛనీయ సంఘటనలకు తావులేకుండా గుంటూరు జిల్లా పోలీసు శాఖ పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. మంగళగిరి, పొన్నూరు మున్సిపాలిటీల్లో ప్రారంభమైన నామినేషన్ల ప్రక్రియతో పాటు రానున్న గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్లు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, ఐపీఎస్ తెలిపారు. శనివారం ఈ మేరకు పోలీసు అధికారులకు పలు సూచనలు జారీ చేశారు.నామినేషన్ల ప్రక్రియలో ఎలాంటి ఒత్తిళ్లు, ప్రలోభాలు, ఘర్షణలకు అవకాశం లేకుండా పోలీసు అధికారులు సమన్వయ ంతో పనిచేయాలని ఆదేశించారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థ లు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజలు తప్పనిసరిగా ఎన్నికల నియమావళిని పాటించాలని స్పష్టం చేశారు.నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థితో పాటు మరో ఇద్దరు ప్రతినిధులకు మాత్రమే నామినేషన్ కేంద్రంలోకి ప్రవేశించేందుకు అనుమతి ఉంటుందని తెలిపారు. నామినేషన్ కేంద్రాల చుట్టూ 150 మీటర్ల పరిధిలో ర్యాలీలు, ఊరేగింపులు నిర్వహించడం, గుంపులుగా రావడం, జనసమూహాలు గుమిగూడటం నిషేధమని పేర్కొన్నారు.జిల్లాలో అమలులో ఉన్న 30 పోలీస్ యాక్ట్, సెక్షన్ 163 బీఎన్ఎస్ఎస్ నిషేధాజ్ఞలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని సూచిం చారు. నామినేషన్ కేంద్రాల పరిసరాల్లో అనుమతి లేని సమా వేశాలు, నినాదాలు, ప్రచార కార్యక్రమాలు నిర్వహించరాదని హెచ్చరించారు.నామినేషన్ కేంద్రాలు, పరిసర ప్రాంతాలపై సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాల ద్వారా నిరంతరం నిఘా ఉంచనున్నట్లు ఎస్పీ వెల్లడించారు. అవసరమైన ప్రాంతాల్లో అదనపు పోలీసు బలగాలను మోహరించి ప్రత్యేక భద్రతా చర్యలు చేపడతా మన్నారు. నామినేషన్ల సందర్భంగా ఘర్షణలు, గొడవలు, బెదిరిం పులు లేదా ఇతర చట్టవ్యతిరేక కార్యకలాపాల కు పాల్పడితే ఉపేక్షిం చేది లేదని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిని గుర్తించి చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు పరిస్థితులను ఎప్పటిక ప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన భద్రతా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజాస్వామ్యబద్ధంగా, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజలు పోలీసు శాఖకు సహకరించాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ విజ్ఞప్తి చేశారు.

ప్రశాంతంగా కొనసాగుతున్న నామినేషన్ల ప్రక్రియ



నరసరావుపేట, రాజధానికి వాయిస్ : నర్సరావుపేట మున్సి పాలిటీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో కొనసాగుతోంది. ఈ సందర్భంగా పల్నాడు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ రోహిత్ కుమార్ చౌదరి, ఐపీఎస్ నేతృత్వంలో నామినేషన్ కేంద్రం వద్ద పటిష్టమైన పోలీసు భద్రతా ఏర్పాట్లు చేపట్టారు.నామినేషన్ల ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీ య సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. నామినేషన్ కేంద్రం పరిసరాల్లో భద్రతను కట్టుదిట్టం చేయడంతో పాటు, ఎన్నికల నిబంధనలు అమలయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు.ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, ప్రశాంతంగా సజావుగా సాగేందుకు అవసరమైన అన్ని భద్రతా చర్యలను పోలీసు శాఖ చేపట్టింది.

గ్రామ పంచాయతీ ఎన్నికలకు 13 మండలాల్లో ప్రత్యేక అధికారుల నియామకం

పారదర్శకంగా, ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు కలెక్టర్ ఉత్తర్వులు



గుంటూరు, నవంబర్ 14 రాజధానికి వాయిస్ : జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికలను పారదర్శకంగా, ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు 13 మండలాలకు ప్రత్యేక అధికారులను నియమిస్తూ జిల్లా కలెక్టర్ సీఎం సాయికాంత్ వర్మ ఉత్తర్వులు జారీ చేశారు.ఎన్నికల నిర్వహణలో అధికారుల మధ్య సమన్వయం, విధుల పర్యవేక్షణ, ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేలా ఈ నియామకాలు చేపట్టారు.రెండో దశలో చేబ్రోలు, పొన్నూరు, తెనాలి, కొల్లిపర, పెదకాకాని మండలాల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించనున్నారు.మూడో దశలో మేడికొండూరు, ఫిరంగిపురం, గుంటూరు రూరల్, పెదనందిపాడు, ప్రత్తిపాడు, వట్టిచెరుకూరు, కాకుమాను, దుగ్గిరాల మండలాల్లో ఎన్నికలు జరగనున్నాయి.ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా, ఎన్నికల నిబంధనలను పక్కాగా అమలు చేస్తూ అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు.

మురసు తుపానుతో దెబ్బతిన్న సాగునీటి వ్యవస్థల పరిశీలన

పల్నాడు జిల్లాలో నష్టాన్ని అంచనా వేసిన కేంద్ర అంతర్ మంత్రిత్వ శాఖల బృందం
ఐదు మండలాల్లో 37 పునరుద్ధరణ పనులకు రూ.3.51 కోట్ల నిధుల అవసరం





పల్నాడు, నవంబర్ 14 రాజధానికి వాయిస్ : మురసు తుపాను కారణంగా జిల్లాలో దెబ్బతిన్న సాగునీటి మౌలిక సదుపాయాల నష్టాన్ని అంచనా వేసేందుకు కేంద్ర అంతర్ మంత్రిత్వ శాఖల బృందం (IMCT) నవంబర్ 14, 2026న పల్నాడు జిల్లాలో పర్యటించింది. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ డాక్టర్ కృతికా శుక్లా, ఐఏఎస్ బృందంతో కలిసి క్షేత్రస్థాయిలో దెబ్బతిన్న సాగునీటి నిర్మాణాలను పరిశీలించారు.ఈ సందర్భంగా బృందం తూబాడు చెరువు, ఓగేరు వాగు, నక్క వాగు, పెదనందిపాడు బ్రాంచ్ కెనాల్ ప్రాంతాల్లో పర్యటించింది. తుపాను ప్రభావంతో తెగిపోయిన చెరువు కట్టలు, కోతకు గురైన కాలువ గట్లు, దెబ్బతిన్న సాగునీటి నిర్మాణాలను క్షుణ్ణంగా పరిశీలించింది. ఆయా ప్రాంతాల్లో జరిగిన నష్టాన్ని కేంద్ర బృందం సభ్యులు ప్రత్యక్షంగా పరిశీలించి వివరాలు సేకరించారు.జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా ఆయా ప్రాంతాల్లో జరిగిన నష్టం తీవ్రతను కేంద్ర బృందానికి వివరించారు. సాగునీటి వ్యవస్థలు దెబ్బతినడం వల్ల వ్యవసాయ భూములపై పడే ప్రభావం, పంటల సాగుకు ఎదురయ్యే ఇబ్బందులు, సాగునీటి సరఫరాను పునరుద్ధరించాల్సిన అవసరాన్ని వివరించారు. దెబ్బతిన్న నిర్మాణాలకు చేపట్టాల్సిన మరమ్మతులు, పునరుద్ధరణ పనుల వివరాలను బృందం దృష్టికి తీసుకెళ్లారు.జిల్లాలోని ఐదు మండలాల పరిధిలో మొత్తం 37 పునరుద్ధరణ పనులను జలవనరుల శాఖ గుర్తించింది. ఈ పనులను చేపట్టేందుకు సుమారు రూ.351.81 లక్షలు (రూ.3.51 కోట్లు) అవసరమవుతాయని అంచనా వేసింది. తుపాను కారణంగా దెబ్బతిన్న సాగునీటి కాలువలు, చెరువులు, ఇతర నీటిపారుదల నిర్మాణాలను తిరిగి వినియోగంలోకి తీసుకువచ్చేందుకు ఈ నిధులు అవసరమని అధికారులు వివరించారు.కేంద్ర బృందం పర్యటన ప్రధానంగా తుపాను వల్ల జరిగిన నష్టాన్ని క్షేత్రస్థాయిలో అంచనా వేయడం, అత్యవసర పునరుద్ధరణ పనులకు ప్రాధాన్యత నిర్ణయించడం, వ్యవసాయ భూములకు నష్టం కలగకుండా అవసరమైన చర్యలను గుర్తించడంపై దృష్టి సారించింది. దెబ్బతిన్న సాగునీటి వ్యవస్థలను పునరుద్ధరించడం ద్వారా రైతులకు సాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా చూడటంతో పాటు భవిష్యత్తులో ప్రకృతి వైపరీత్యాలను తట్టుకునేలా మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడంపై ఈ పర్యటనలో పరిశీలన జరిగింది.తుపాను కారణంగా దెబ్బతిన్న సాగునీటి వనరుల పునరుద్ధరణకు అవసరమైన చర్యలను ప్రాధాన్యత క్రమంలో చేపట్టేందుకు ఈ క్షేత్రస్థాయి పర్యటన దోహదపడనుంది. కేంద్ర బృందానికి జిల్లా యంత్రాంగం, జలవనరుల శాఖ అధికారులు నష్టానికి సంబంధించిన వివరాలను అందించారు.

బాలలే.. భారతావనికి బలం

చదువుతో పాటు క్రీడలు, సంగీతం, నాట్యం, కళల్లోనూ ప్రావీణ్యం సాధించాలి -- జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ





గుంటూరు, నవంబర్ 14రాజధానికి వాయిస్ : బాలలే భారతావనికి బలమని, నేటి బాలలే రేపటి దేశ భవిష్యత్తు అని జిల్లా జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ పేర్కొన్నారు. విద్యార్థులు కేవలం చదువుకే పరిమితం కాకుండా క్రీడలు, సంగీతం, నాట్యం, కళలు, వివిధ వృత్తి నైపుణ్యాల్లోనూ ప్రతిభను పెంపొందించుకోవాలని సూచించారు. క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, పట్టుదల, సామాజిక బాధ్యతతో ఎదిగినప్పుడే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహిం చగలరని అన్నారు.జాతీయ బాలల దినోత్సవం మరియు స్పోర్ట్స్ డే సందర్భంగా భారతీయ విద్యా భవన్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమానికి జిల్లా జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన ప్రసంగిస్తూ బాలలలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీ యడానికి విద్యాసంస్థలు, ఉపాధ్యాయులు తగిన ప్రోత్సాహం అందించాలని సూచించారు.విద్యార్థి దశ అనేది జీవితానికి పునాది వేసుకునే కీలకమైన సమయమని, ఈ దశలోనే మంచి అలవాట్లు, క్రమశిక్షణ, సమయపాలన అలవర్చుకోవాలని తెలిపారు. చదువు లో రాణించడంతో పాటు శారీరక దృఢత్వానికి క్రీడలకు ప్రాధా న్యత ఇవ్వాలని చెప్పారు. క్రీడలు విద్యార్థుల్లో జట్టుగా పనిచేసే స్వభావం, నాయకత్వ లక్షణాలు, గెలుపోటములను సమానంగా స్వీకరించే మనస్తత్వాన్ని పెంపొందిస్తాయని వివరించారు. అదేవిధంగా సంగీతం, నాట్యం, కళలు, సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థుల్లో సృజనాత్మకతను, ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయని పేర్కొన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా వృత్తి నైపుణ్యాలను కూడా అభివృద్ధి చేసుకోవాలని, సమాజం పట్ల బాధ్యత కలిగిన పౌరులుగా ఎదగాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ప్రతి విద్యార్థి లోనూ ఏదో ఒక ప్రత్యేక ప్రతిభ ఉంటుందని, దానిని గుర్తించి నిరంతర సాధనతో మరింత మెరుగుపరుచుకోవాలని సూచిం చారు. ఈ సందర్భంగా భారతీయ విద్యా భవన్ విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఆకట్టు కున్నాయి. సంప్రదాయ కళారూపమైన బుర్రకథ ప్రదర్శనతో పాటు విద్యార్థులు నిర్వహించిన కవాతు, తైక్వాండో ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శి స్తూ ఉత్సాహంగా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.జాతీయ బాలల దినోత్సవం, స్పోర్ట్స్ డే సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమం విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపింది. విద్య, క్రీడలు, సాంస్కృతిక రంగాల్లో సమాన ప్రాధాన్యతతో ముందుకు సాగాలనే సందేశాన్ని ఈ వేదుక చాటిచెప్పింది.ఈ కార్యక్రమంలో భారతీయ విద్యా భవన్ ప్రిన్సిపల్ శ్రీమతి హేమాంబ, ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీ మానస, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ ఎన్నికల్లో చిటికెన వేలికి చెరగని సిరా గుర్తు

గందరగోళానికి తావులేకుండా రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయం -- జిల్లా కలెక్టర్ సాయికాంత్ వర్మ



గుంటూరు, రాజధానికి వాయిస్ గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఓటర్ల ఎడమ చేతి చిటికెన వేలికి చెరగని సిరా గుర్తు వేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశించినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సి.ఎం. సాయికాంత్ వర్మ తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి గందరగోళం, ఇబ్బందులు తలెత్తకుండా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.గతంలో నిర్వహించిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల సందర్భంగా ఓటర్ల ఎడమ చేతి చూపుడు వేలు, మధ్య వేలికి చెరగని సిరా గుర్తు వేయడంతో కొన్ని సందర్భాల్లో గందరగోళం ఏర్పడినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సిరా గుర్తు వేసే వేలిని మార్చుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం తాజా ఆదేశాలు జారీ చేసిందని వివరించారు.ఇకపై గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునే ప్రతి ఓటరికి ఎడమ చేతి చిటికెన వేలిపై మాత్రమే చెరగని సిరా గుర్తు వేయాలని స్పష్టం చేశారు. ఈ విధానాన్ని పోలింగ్ సిబ్బంది తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ సూచించారు.ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బంది రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలని, ఓటింగ్ ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఎన్నికల నిర్వహణలో స్పష్టమైన విధానాలను పాటించడం ద్వారా ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని తెలిపారు.

కార్తీక మాసి వేడుకలు..
వైభవంగా సహస్ర లింగార్చన, దీపాలంకరణ, ఊయల సేవ

శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు
వేద మంత్రోచ్చారణల నడుమ భక్తిశ్రద్ధలతో విశేష పూజా కార్యక్రమాలు





విజయవాడ, రాజధానికి వాయిస్ : పవిత్ర కార్తీక మాసాన్ని పురస్కరించుకుని దుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. ప్రదోష కాలంలో శ్రీ మల్లేశ్వరస్వామి వారి ఆలయంలో ఆకాశదీపం, సహస్ర లింగార్చన, సహస్ర దీపాలంకరణ, ఊయల సేవ కార్యక్ర మాలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఆలయ స్థానాచా ర్యులు శివప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో వేద పండితులు, అర్చక బృందం శాస్త్రోక్తంగా వేద మంత్రోచ్చారణల నడుమ ఈ విశేష పూజా క్రతువులను నిర్వహించారు. కార్తీక మాసంలో విశేష ప్రాధా న్యత కలిగిన ఈ పూజా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.కార్తీక మాసంలో నిర్వహించే సహస్ర లింగార్చనకు విశేష ఆధ్యాత్మిక ప్రాధాన్యత ఉందని అర్చక స్వాము లు తెలిపారు. వేయి లింగాలకు ఏకకాలంలో అర్చనలు నిర్వహిం చడం ద్వారా భక్తులకు ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు సిద్ధిస్తా యని ఆగమ శాస్త్రాలు పేర్కొంటున్నాయని వివరించారు. ఈ పూజల్లో పాల్గొని పరమేశ్వరుడిని దర్శించుకోవడం వల్ల పాపాలు తొలగి, గ్రహ దోషాల నుంచి విముక్తి లభిస్తుందని భక్తుల విశ్వాసమని తెలిపారు.ఈ విశేష పూజా కార్యక్రమాల్లో దేవస్థాన ట్రస్ట్ బోర్డు చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ), కార్యనిర్వహణా ధికారి వి.కె. శీనా నాయక్ పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు సమర్పించారు. సహస్ర దీపాల కాంతులతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. భక్తుల హరినామ స్మరణలు, వేద మంత్రోచ్చారణల మధ్య సహస్ర లింగార్చన నిర్వహించగా, అనంతరం జరిగిన దుర్గా మల్లేశ్వరస్వామి వార్ల ఊయల సేవ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.కార్తీక మాస పవిత్రతను చాటి చెప్పేలా నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో భక్తులు భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. పూజా కార్యక్రమాలు ముగిసిన అనంతరం భక్తులకు దేవస్థానం తరపున ప్రసాదాలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో దేవస్థాన ధర్మకర్తల మండలి సభ్యులు రాఘవ రాజు, ఎ. శ్రీనివాసరావు, సరిత, పద్మావతి ఠాకూర్, ప్రత్యేక ఆహ్వానితులు వి. శంకర బాబు, ఆలయ అర్చకులు, వేద పండితులు, సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

జెడ్పిటీసికి జంగా అభినందనలు



పిడుగురాళ్ల.నవంబర్ 14 రాజధానికి వాయిస్ : పల్నాడు జిల్లా పిడుగురాళ్ల జడ్పీటీసీగా అత్యధిక మెజారిటీతో విజయం సాధించిన జెడ్పిటీసిడాక్టర్ వున్నం దీపిక నాగమల్లికార్జునరావు లను మాజీ ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తి, చింతా రెడ్డి వెంకట్ రెడ్డి, సుధా బాల కోటేశ్వరరావు,కట్ట వెంకట శ్వర్ రెడ్డి, నంద్యాల వెంకటేశ్వర్ రెడ్డి,అభినందిస్తూ ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.

గ్రేస్ అండ్ జస్టిస్ ట్రస్టు ఆధ్వర్యంలో విద్యార్థులకు బిస్కెట్లు పంపిణీ



రాజుపాలెం. నవంబర్ 14రాజధాని వాయిస్ : భారత మొదటి ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ (చాచా నెహ్రూ) పుట్టినరోజు బాలల దినోత్సవం సందర్భంగా రాజుపాలెం మండలం, దేవరంపాడు గ్రామంలో ఎంపీపీ పాఠశాల,(ఎస్సీ) అంగన్ వాడీ కేంద్రంలో గ్రేస్-అండ్-జస్టిస్ ఛారిటబుల్ ట్రస్టు అధినేత గంటేల జాన్ బాబు,సభ్యులు ప్రత్తిపాటి శ్రీనివాసరావు చిన్నారులకు చాచా నెహ్రూ పుట్టినరోజు బాలల దినోత్సవ శు భాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా విద్యార్థులకు బిస్కెట్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



చిలకలూరిపేట. నవంబర్ 14 రాజధాని వాయిస్ : పట్టణంలోని 32వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు షేక్ దరియావలి (శివమణి) ఇటీవల గుండె శస్త్రచికిత్స చేయించుకున్నారు. ఈ నేపథ్యంలో గుంటూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన్ను మాజీ మంత్రి విడదల రజిని ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు.ఈ సందర్భంగా దరియావలి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఆయన త్వరగా సంపూర్ణ ఆరోగ్యం కోలుకుని, మళ్లీ ప్రజా సేవలో మరియు పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని ఆకాంక్షించారు. ఈ క్లిష్ట సమయంలో దరియావలికి, వారి కుటుంబ సభ్యులకు ఆమె ధైర్యం చెప్పారు.

వై.యస్. భారతీపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి





మాచర్ల.నవంబర్ 14 రాజధాని వాయిస్ : వైసీపీ అధినేత వైఎస్ మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి సతీమణి వై.యస్. భారతీ రెడ్డిపై సోషల్ మీడియా వేదికగా కొందరు అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన వారిపై ప్రభుత్వం మరియు పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని వైసిపి పల్నాడు జిల్లా అధ్యక్షుడు మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ, జనసేన అధినేత వ్యక్తిగత జీవితంపై చర్చ జరుగుతున్నప్పటికీ తాము సంయమనం పాటిస్తున్నామని, కానీ జనసేన వర్గీయులు మాత్రం జగన్ కుటుంబ సభ్యులపై వ్యక్తిగత దూషణలకు పాల్పడుతున్నా రని మండిపడ్డారు. రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైందని, ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన హెచ్చరించారు.

బాల్యం ఎంతో విలువైనది న్యాయవాది దేవర శ్రీను



పిడుగురాళ్ల. నవంబర్ 14 రాజధాని వాయిస్: పిడుగు రాళ్ల కె.ఎన్.ఆర్ విద్యాసంస్థలు,కొండమోడు పిఎస్ఆర్ డిగ్రీ కాలేజ్ నందుభారతదేశ తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్ లాల్ నెహ్రూ జయంతిని కళాశాల డైరెక్టర్ కోనేటి నరసింహారావు, బాడిస మస్తాన్ రావు అధ్యాపకులు నెహ్రూ చిత్రపటానికి పూలం కృతులను చేసి ఘనంగా నివాళులు అర్పించినారు. ఈ కార్యక్రమా నికి ముఖ్యఅతిథి లాయర్ దేవర శ్రీను హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జీవితంలో బాల్యం ఎంతో విలువైన దని,ఈ దశలోనే మంచి అలవాట్లు, క్రమశిక్షణ, పట్టుదల, నిజాయితీ, దేశభక్తి అలవర్చుకోవాలని,గురువులను గౌరవించాలి, తల్లిదండ్రుల మాట వినాలని, బాగా చదువుకోవాలని, సమాజానికి ఉపయోగపడే మంచి పౌరులుగా ఎదగాలన్నారు. డైరెక్టర్లు మాట్లాడుతూ, చాచా నెహ్రూ జయంతిని జాతీయ పిల్లల దినోత్సవ ంగా జరుపుకోవడం మనందరికీ గర్వకారణం,పిల్లల చేతిలో పుస్తకం ఉంటే దేశానికి భవిష్యత్తు ఉంటుందని, పిల్లల మనసులో మంచి ఆలోచనలు ఉంటే సమాజానికి వెలుగుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు సాధినేని నరసింహారావు, సిహెచ్ శ్రీనివాసరావు, వంగివరపు రాజా, దీపంగి. సురేష్,జె. వీరాంజనేయులు,టి గోపికృష్ణ, కోనేటి ప్రసన్న,బి ఇందు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విజయపురి సౌత్‌లో అంగరంగ వైభవంగా బాలల దినోత్సవం

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాలలో ఘన వేడుకలు
14 రకాల వంటలతో విద్యార్థినులకు ప్రత్యేక విందు
పర్యావరణ పరిరక్షణలో భాగంగా మినీ ఫారెస్ట్ ఏర్పాటు, మొక్కల పెంపకం



విజయపురి సౌత్. నవంబర్ 14 రాజధాని వాయిస్ : మాచర్ల నియోజకవర్గంలోని విజయపురి సౌత్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాలలో శుక్రవారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ వాణి ఆధ్వర్యం లో జరిగిన ఈ వేడుకల్లో నేటి బాలలే రేపటి పౌరులని, విద్యార్థుల అభ్యున్నతితోనే భావితరాల పునాదులు నిర్మితమవుతా యని పేర్కొన్నారు. విద్యార్థినులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసిం చి భవిష్యత్తులో అత్యున్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాం క్షించారు. చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ చాటి ప్రపంచ స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు.ఈ వేడుకల్లో భాగంగా విద్యా ర్థులను ప్రోత్సహించేందుకు క్రీడా పోటీల్లో గెలుపొందిన వారికి బోధనేతర సిబ్బంది చేతుల మీదుగా బహుమతులు అందజేసి సత్కరించారు. అనంతరం బాలల దినోత్సవం పురస్కరించుకుని 14 రకాల రుచికరమైన వంటలతో విద్యార్థినులకు ఘనంగా విందు ఏర్పాటు చేశారు.

మినీ ఫారెస్ట్ రూపకల్పన - హరిత స్ఫూర్తి

పాఠశాల ప్రాంగణంలో పౌష్టికాహార (న్యూట్రిషన్ ఫుడ్) అవశ్యకతపై అవగాహన కల్పిస్తూ కూరగాయ మొక్కలు నాటారు. పర్యావరణ మార్పుల నేపథ్యంలో స్వచ్ఛమైన ఆక్సిజన్ లభించేలా మినీ ఫారెస్ట్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మొక్కలను నాటి సంరక్షించడం ద్వారా ఆహ్లాదకరమైన వాతావరణాన్ని సాధించి, విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

జైల్లో ఉండి పెళ్లకూరు జెడ్పీటీసీగా విజయం..
కామినేని సత్యనారాయణరెడ్డికి సన్మానం



నెల్లూరు, రాజధానికి వాయిస్ : జైల్లో ఉండగానే పెళ్లకూరు జెడ్పీటీసీగా 1,708 ఓట్ల భారీ మెజారిటీతో విజయం సాధించిన కామినేని సత్యనారాయణరెడ్డికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా సన్మానం చేశారు. కందుకూరు నియోజకవ ర్గ వైసీపీ పరిశీలకుడిగా ఉన్న ఆయనను కందుకూరు పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జ్ బుర్రా మధుసూదన్ యాదవ్ ఘనంగా సత్కరించారు. ఇటీవల జరిగిన జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసిన కామినేని సత్యనారాయణరెడ్డిపై అక్రమ కేసులు నమోదు చేసి జైలుకు పంపించారని వైసీపీ నాయకులు ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఆయన జైలులో ఉన్నప్పటికీ పెళ్లకూరు జెడ్పీటీసీ స్థానంలో పోటీ చేసి విజయం సాధించడం విశేషమని పేర్కొన్నారు.జైల్లో ఉండి కూడా ప్రజల మద్దతుతో 1,708 ఓట్ల భారీ మెజారిటీ సాధించడం ఆయనకు లభించిన ప్రజాభిమానానికి నిదర్శనమని బుర్రా మధుసూదన్ యాదవ్ అభినందించారు. రాజకీయ కారణాలతోనే కేసులు పెట్టి ఇబ్బం దులకు గురిచేశారని వైసీపీ నాయకులు విమర్శించారు. కందుకూ రు నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో కామినేని సత్యనారాయణరెడ్డిని నాయకులు, కార్య కర్తలు అభినందించారు. ఎన్నికల్లో ఎదురైన పరిస్థితులను అధిగమించి విజయం సాధించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఆయనకు పార్టీ తరఫున అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా బుర్రా మధుసూదన్ యాదవ్ మాట్లాడుతూ, ఎన్నికల్లో కామినేని సత్యనారాయణరెడ్డి సాధించిన విజయాన్ని ప్రత్యేకంగా అభినందించారు. ప్రజల మద్దతుతో లభించిన ఈ విజయాన్ని పార్టీ శ్రేణులు స్ఫూర్తిగా తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ గేమ్స్‌కు దూరంగా ఉండి గ్రంథాలయాలను వినియోగించుకోండి



గుంటూరు, రాజధానికి వాయిస్ : విద్యార్థులు సెల్‌ఫోన్ గేమ్స్‌కు దూరంగా ఉండి గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి పిలుపునిచ్చారు. బాలల దినోత్సవం, 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా శనివారం గుంటూరు అరండల్‌పేట 5/3లోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన ర్యాలీని పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి రోజూ ఉదయం నిద్రలేవగానే, రాత్రి నిద్రపోయే ముందు 'మిమ్మల్ని మీరు అవమానించుకోవద్దు.. ఇతరులను అవమానించవద్దు' అనే రెండు వాక్యాలను గుర్తుంచుకోవాలని సూచించారు. ఇతరులతో పోల్చుకుని తమను తాము తక్కువగా అంచనా వేసుకోవద్దని, తోటి విద్యార్థులను కూడా ఏ విషయంలోనూ కించపరచకూడదని చెప్పారు. వచ్చే బాలల దినోత్సవం వరకు ఈ నియమాన్ని పాటిస్తే చదువులో రాణించడంతో పాటు మంచి వ్యక్తిత్వాన్ని అలవర్చుకోవచ్చని తెలిపారు.ప్రస్తుతం పిల్లలు సెల్‌ఫోన్ గేమ్స్‌కు అలవాటు పడుతుండటంపై ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఫోన్లలో ఎక్కువ సమయం గేమ్స్ ఆడటం వల్ల శారీరక చురుకుదనం తగ్గడంతో పాటు మానసిక ఎదుగుదలపై ప్రభావం పడుతుందని హెచ్చరించారు. సెల్‌ఫోన్ గేమ్స్‌కు దూరంగా ఉండి సాయంత్రం వేళల్లో మైదానాల్లో ఆటలు ఆడుకోవాలని సూచించారు. శారీరక వ్యాయామం, ఆటల వల్ల శరీరం దృఢంగా, చురుగ్గా ఉంటుందని వివరించారు. ఆదివారాలు, ఇతర సెలవు రోజుల్లో విద్యార్థులు తప్పనిసరిగా గ్రంథాలయాలకు వెళ్లాలని ఎమ్మెల్యే సూచించారు. పుస్తక పఠనం వల్ల విజ్ఞానం పెరగడంతో పాటు ఆలోచనా విధానం, మేధాశక్తి అభివృద్ధి చెందుతాయని చెప్పారు. గ్రంథాలయ వారోత్సవాల్లో నిర్వహించే పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనాలని, ప్రతిభ కనబరిచిన తోటి విద్యార్థులను మనస్ఫూర్తిగా అభినందించే గుణాన్ని అలవర్చుకోవాలని కోరారు. విద్యార్థుల్లో వినోదంతో పాటు విజ్ఞానాన్ని పెంపొందించేలా డ్రాయింగ్ తదితర పోటీలను నిర్దిష్ట అంశాల ఆధారంగా నిర్వహించాలని గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ వందనా దేవి, సిబ్బందికి సూచించారు. వారోత్సవాలను తూతూమంత్రంగా కాకుండా శ్రద్ధగా నిర్వహిస్తూ చుట్టుపక్కల పాఠశాలల విద్యార్థులను భాగస్వాములను చేస్తున్న సిబ్బందిని అభినందించారు. గ్రంథాలయ అభివృద్ధికి ఆర్థిక సహాయం, సహకారం అందిస్తున్న దాతలు, పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఐపీఎస్ అధికారి కుటుంబం

మంత్రి ఆనం పరామర్శ



ఆత్మకూరు.నవంబర్ 14 రాజధాని వాయిస్ : నెల్లూరు జిల్లా అనంతసాగరం మండలం చాపురాళ్లపల్లి వద్ద జాతీయ రహదారి 565 పై జరిగిన రోడ్డు ప్రమాదంలో తెలంగాణ కేడర్ కు చెందిన 2012 బ్యాచ్ ఐపీఎస్ అధికారి రాజీవ్ గాంధీ హనుమంతు కుటుంబ సభ్యులు గాయపడ్డారు. ప్రమాద సమాచా రం అందుకున్న రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనా రాయణ రెడ్డి వెంటనే స్పందించి ఆత్మకూరు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకున్నారు. క్షతగాత్రులకు అందుతున్న అత్యవసర వైద్య చికిత్సను దగ్గరుండి పర్యవేక్షించి, వైద్యులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం కోసం బాధితులను నెల్లూరులోని అపోలో ఆసుపత్రికి తరలిం చేలా ఆయన ప్రత్యేక ఏర్పాట్లు చేయించారు.

సినీనటుడు గిరిబాబు మృతి తీరని లోటు

నటుడిగా, దర్శకుడిగా, నిర్మాతగా తెలుగు సినీ పరిశ్రమలో ప్రత్యేక గుర్తింపు : హోంమంత్రి అనిత

అమరావతి.నవంబర్ 14 రాజధాని వాయిస్ : ప్రము ఖ సినీనటుడు గిరిబాబు మృతి పట్ల రాష్ట్ర హోంమంత్రి వంగల పూడి అనిత తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దశాబ్దాల పాటు తనదైన నటనతో వందలాది చిత్రాల్లో విభిన్న పాత్రలు పోషించి ప్రేక్షకులను అలరించిన గిరిబాబు మరణం బాధాకర మని పేర్కొన్నారు. నటుడిగా, దర్శకుడిగా, నిర్మాతగా తెలుగు సినీ పరిశ్రమలో గిరిబాబు తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదిం చుకున్నారని మంత్రి కొనియాడారు. ఎన్నో సంవత్సరాల పాటు విభిన్న పాత్రలతో తెలుగు ప్రేక్షకులను మెప్పించి వారి హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారని గుర్తుచేశారు. ఆయన మరణం తెలుగు సినీ పరిశ్రమకు తీరని లోటన్నారు. గిరిబాబు ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, ఈ విషాద సమయంలో ఆయన కుటుంబ సభ్యులకు హోంమంత్రి అనిత తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

నరసరావుపేటలో మున్సిపల్ నామినేషన్ల పరిశీలన

భద్రతపై ఎస్పీ ప్రత్యేక దృష్టి



నరసరావుపేట.నవంబర్ 14రాజధాని వాయిస్ :నరసరావుపేట మున్సిపాలిటీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో, పకడ్బందీ భద్రతా నడుమ నిర్వహి ంచేందుకు పోలీసు యంత్రాంగం పూర్తి ఏర్పాట్లు చేసింది. ఇందులో భాగంగా శనివారం నరసరావుపేట మున్సిపల్ కార్యాల యంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలను పల్నాడు జిల్లా ఎస్పీ జగదీష్ అదహళ్లి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా నామినేషన్ల కేంద్రాల వద్ద అమలు చేస్తున్న బందోబస్తు తీరును ఆయన పరిశీలించి, విధుల్లో ఉన్న పోలీసు అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఎలాంటి అవాం ఛనీయ సంఘటనలకు తావులేకుండా, ఎన్నికల నిబంధన లను ప్రతి ఒక్కరూ ఖచ్చితంగా పాటించేలా అప్రమత్తంగా వ్యవహరి ంచాలని ఆదేశించారు. అభ్యర్థులు ఎలాంటి భయాం దోళనలకు గురికాకుండా, స్వేచ్ఛాయుత వాతావరణంలో వచ్చి నామినేషన్లు దాఖలు చేసేలా వారికి పూర్తి భద్రత కల్పిస్తామని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు.ఈ తనిఖీ కార్యక్రమంలో ఎస్పీతో పాటు అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) రోహిత్ కుమార్ చౌదరి, నరసరా వుపేట ఏఎస్పీ ఎం. హనుమంతరావు, మున్సిపల్ కమిషనర్ రమ్య కీర్తన తదితర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

సినీనటుడు గిరిబాబు మృతి పట్ల మంత్రి డా. డోలా బాల వీరాంజనేయస్వామి సంతాపం



అమరావతి. నవంబర్ 14 రాజధాని వాయిస్ :సినీనటుడు గిరిబాబు మృతి పట్ల మంత్రి డా. డోలా బాల వీరాంజ నేయస్వామి సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శనివారం మంత్రి మాట్లాడుతూ,గిరిబాబు కింది స్థాయి నుంచి స్వయంకృషితో అంచలంచలుగా ఎదిగి సినీ రంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదిం చుకున్నారన్నారు. ఆయన తనవంతుగా సమాజం కోసం అనేక సేవా కార్యక్రమాలు చేశారని, ఎంత ఎదిగినా సొంత ఊరిపై మమకారంతో రావినూతల గ్రామంలో అనేక అభివృద్ధి కార్యక్ర మాలు చేపట్టారని తెలిపారు. గిరిబాబుకు ప్రకాశం జిల్లాకు విడదీయలేని బంధం ఉందన్నారు. గిరిబాబు ఆత్మకు శాంతి చేకూరాలని దేవున్ని ప్రార్థిస్తూ కుటుంబ సభ్యులకు మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

PRINTED, PUBLISHED AND OWNED BY PAGALA PURNA CHANDRA RAO. MUTUKURU (POST) DURGI MANDAL MACHERLA CONSTITUENCY. PALNADU DISTRICT.AP.DOOR N0 0-004 PINCODE 522612 PHONE NUMBER 9030343195. PRINTED AT SRI KANAKA BHARGAV OFF-SET PRINTERS. MAIN ROAD ANJANEYA COLONY REDDYPALEM GUNTUR 522009 ANDHRA PRADESH . EDITOR :PAGALA PURNA CHANDRA RAO
RNI NO :APTEL/2023/90201PHONE NUMBER : 9030343195.EMAIL. rajadhanivoicedaily@gmail.com